# ఆర్థిక నైపుణ్యం

(గల్పిక)

మంగదేశంలో అన్ని రకాల ఉత్పత్తులూ క్షీణించి డబ్బు ఉత్పత్తి పెరిగిపోయింది. రూపాయి విలువ పది పైసలకు దిగిందన్నారు. ఆ పదిపైసల విలువచేసే రూపాయలన్నా ఉత్పత్తిచేసే శ్రామికుల వద్ద లేవు. వాళ్ళకు మొదలు పనులే లేవు.

రూపాయి విలువ కనీసం ఇరవై పైసలకు పెంచటం ఎలాగా అని ఆర్థిక నిపుణులు చర్చించారు. రూపాయల చలామణీ హెచ్చుగా ఉన్నది. పనులున్న అదృష్టవంతులకు జీతం కన్న కరువుభత్యాలు హెచ్చుగా ఉంటున్నాయి.

"కరువుభత్యాలు ద్రవ్యోల్బణాన్ని పెంచుతున్నాయి. వాటిని బిగించాలి. కరువు భత్యం తీసెయ్యొద్దు. దాన్ని బిగించి, పనివాళ్ళ పేర బ్యాంకుల్లో వేద్దాం. తరవాత వడ్డీతోసహా వాళ్ళకే ఇయ్యొచ్చు. డబ్బు పొదుపుచేసినవాళ్ళూ అవుతారు!" అన్నాడొక నిపుణుడు.

ఆర్థిక నైపుణ్యంలేని ఒక అజ్ఞాని, "కరువుభత్యం హెచ్చు ధరలకు జనం తట్టుకోవాలనేగదా ఇస్తాం? దాన్ని బిగదియ్యటంలో పాయింటేమిటి?" అని అడిగాడు.

ఎవరూ వినిపించుకోలేదు.

ఆర్థికమంత్రికి ఇంకా బ్రహ్మాండమైన ఆలోచన వచ్చింది. "పనివాళ్ళందరి జీతాలూ ఆరునెలలు తొక్కిపెట్టి, వాళ్ళ ఎకౌంటులో బాంకులో వేస్తే రూపాయి విలువ నలభై పైసలదాకా పెంచవచ్చు," అన్నాడు.

అందరూ చప్పట్లు కొట్టారు. అది అమలు జరిగింది. సంవత్సరాంతంలో ఆర్థిక మంత్రికి "ద్రవ్యకళాప్రపూర్ణ" బిరుదు ఇచ్చారు.

---

*కొడవటిగంటి కుటుంబరావు*

---